క్లుప్తంగా

వైద్య శిబిరంలో 84 మందికి పరీక్షలు



పేదలకు దుప్పట్లు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: సీనియర్ సిటిజన్లు సామాజిక సేవలు చేపట్టడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు.సీనియర్ సిటిజన్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బీసీ కమ్యూనిటీ భవనంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు కె. శ్రీవిద్య 84 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అద్దాల పెద దుర్గారావు, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ చేతుల మీదుగా 50 పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షులు అడపా సూర్యచంద్రరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, దారపురెడ్డి సూర్యచంద్రరావు, కీర్తి ఆంజనేయులు, బలగం అప్పారావు, గొన్నాబత్తుల రామారావు, దేవిశెట్టి వీరభద్రరావు, పాలా భాస్కరరావు, పితాని జార్జి, శమంతకమణి, పొన్నా సుబ్రహ్మణ్యశర్మ, ముగండ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహం



నగర సంకీర్తన చేస్తున్న రామానంద గాడీయ మఠం స్వాములు

కొవ్వూరు: స్థానిక శ్రీరామానంద గాడీయ మఠంలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహం ఆరో రోజు మంగళవారం కూడా కొనసాగాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మఠాధిపతులు, స్వామీజీలు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు.అనంతరం మేళతాళాలతో నగర సంకీర్తన చేశారు. మఠంలో చింతలపూడి భక్తబృందం భజన, సంకీర్తనలు నిర్వహించారు.26వ తేదీ ఉదయం 8 గంటలకు మఠాధిపతి సుధీర దామోదర మహారాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు మఠం నిర్వాహకుడు వామన మహరాజ్ తెలిపారు.

తాళ్లపూడిలో భూముల రీసర్వే

తాళ్లపూడి: జగనన్న సంపూర్ణ భూ హక్కు పథకంలో భాగంగా విటాల్ డ్రోన్ సాయంతో మండలంలోని తాళ్లపూడిలో మంగళవారం సర్వే చేశారు. గ్రామంలోని అన్ని భూములను డ్రోన్ సాయంతో రీ సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోలి అన్నవరం, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ భారతి, పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న తొమ్మిది మందిపై కేసు

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెం శివార్లలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.20,090 నగదు,ఆరు సెల్‌ఫోన్లు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ బి.నరసింహమూర్తి తెలిపారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం సాముహిక రమా సత్యనారాయణస్వామి వారి వ్రతాలు ఆచరించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం జిల్లెళ్లమూడి అమ్మవారి శత జయంతి మహోత్సవ సందేశ సభ నిర్వహించారు.విశ్వజననీ పరిషత్ ట్రస్టు సభ్యుడు బ్రహ్మాండం రవీంద్రరావు, అమృతత్త్వ కార్యదర్శి యు.వరలక్ష్మి, మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ బీఎస్ సుగుణ, మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి జిల్లెళ్లమూడి అమ్మ వారి గురించి వివరించారు. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో మహా గణపతి హోమం, సాయంత్రం నాలుగు గంటల నుంచి హనుమాన్ చాలీసా పారాయణ, రాత్రికి సంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జనసేన నాయకుల పూజలు

దేవరపల్లి: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేపట్టిన వారాహి వాహన కార్యక్రమం విజయవంతం కావాలని ఆ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం స్థానిక ఆంజనేయ స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు డి.సువర్ణరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శులు జాజిమొగ్గల శ్రీనివాస్, సూరిశెట్టి బాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరగతిలో బోధన.. ట్యాబ్‌లతో సాధన

- డిజిటల్ బోధన దిశగా అడుగులు
- ఆఫ్‌లైన్‌లోనూ పాఠ్యాంశాలు అందుబాటులో..
- సర్కారీ విద్యకు మహర్దశ



దూబచర్ల జెడ్పీ హైస్కూల్లో ట్యాబ్‌లతో విద్యార్థినులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

నల్లజర్ల: నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నారు. మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించి చదివిస్తే, తల్లుల ఖాతాలకు అమ్మఒడి పథకం కింద ప్రభుత్వం ఏటా సొమ్ములను జమ చేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు అన్నిరకాల విద్యాసామగ్రితో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్నారు. ఇవేగాకుండా జగనన్న గోరుముద్ద పేరుతో ప్రతి పాఠశాల్లోను విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఇపుడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్య అందించేందుకు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. దీనినిబట్టి ప్రభుత్వ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యం ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు వీలుగా ట్యాబ్‌లు అందించారు.

ట్యాబ్‌లలో పాఠాలు ఇలా..

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లలో బైజూస్ సంస్థ అందించిన అభ్యాసన సమాచారంలో గణిత, భౌతిక, రసాయన శాస్త్రాలు, పౌర, జీవశాస్త్రాలు, చరిత్ర పాఠ్యాంశాలను నిక్షిప్తం చేశారు. మొత్తం 57 చాప్టర్లకు 471 కాన్సెప్టులపై 300 వీడియోలను, జవాబులతో కూడిన 168 ప్రశ్నా పత్రాలను ఇందులో ఉంచారు. ఒక్కో చాప్టర్ తర్వాత 40–50 ప్రశ్నలు, గ్రేడ్‌ల వారీగా నమూనా పరీక్షలు ఉంటాయి. దీనివల్ల బడిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను విద్యార్థులు ఇంటి వద్ద పునశ్చరణ చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఆయా పాఠాలు సులువుగా అర్థం అయ్యేలా బొమ్మలు, వీడియో, ఆడియో, త్రీడీ, యానిమేషన్ల ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను అందుబాటులో ఉంచారు. దీని వల్ల విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థం అవుతాయి. ఒకసారి ట్యాబ్‌లో అప్‌లోడ్ చేసిన పాఠ్యాంశాలను ఆఫ్‌లైన్‌లో కూడా విద్యార్థులు చదువుకోవచ్చు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్ల ఇంటర్నెట్ సౌకర్యం లేకపోయినా చదువు కోవడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



గతంలో ప్రభుత్వ పాఠశాలలను అంతగా పట్టించుకోలేదు. పాఠశాలల్లో వసతులు మెరుగు పరచడంతో పాటు నాణ్యమైన బోధన కోసం విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. వాటి వల్ల విద్యార్థులు ఇంటి వద్ద కూడా పాఠాలు చదువుకోవడానికి అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇంతగా ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– కె.నాగమల్లి, విద్యార్థి తల్లి, దూబచర్ల

చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారా బోధన చాలా బాగుంది. ప్రతి పాఠ్యాంశం సులభంగా అర్థం అవుతోంది. తరగతి గదిలో ఉపాధ్యాయులు అన్ని అంశాలనూ బోధించడమే గాకుండా ఇంటివద్ద కూడ ఏయే అంశాలు నేర్చుకోవాలో వివరంగా చెబుతున్నారు.

– బి.ధనలక్ష్మి, 8వ తరగతి విద్యార్థిని, దూబచర్ల హైస్కూల్

ఎంతో మంచి నిర్ణయం



విద్యార్థులు డిజిటల్ విద్యకు దగ్గర కావడానికి, సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు. ఇది ఎంతో మంచి నిర్ణయం.

– బి.శ్రీనివాసరావు, ఫిజిక్స్ టీచర్, దూబచర్ల హైస్కూల్

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



పొక్లెయిన్‌తో రోడ్డు అంచులు తవ్వుతున్న దృశ్యం

నిడదవోలు: అభివృద్ధి పనులపై నిడదవోలు పురపాలక సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధాన సెంటర్లలోని బీటీ రోడ్లను సీసీ రోడ్లుగా ఇప్పటికే అభివృద్ధి చేశారు. ఇప్పుడిక పట్టణంలోని ప్రధాన రోడ్ల విస్తరణకు శ్రీకారం చుట్టింది. పట్టణంలోని గణేశ్ చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకూ చేపట్టిన నాలుగు లేన్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందుకోసం ఈ రోడ్డుకు ఇరువైలా ఉన్న ఆక్రమణలను, చెట్లను ఇప్పటికే తొలగించారు. 15వ ఆర్థిక సంఘ నిధులు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.1.96 కోట్ల వ్యయంతో ఈ సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే సెంటర్లు కావడంతో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి, ప్రమాదాలకు చెక్ పెట్టడానికి ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం రెండు లేన్ల రోడ్డుకు ఇరువైపులా పొక్లెయిన్‌తో పనులు జరుగుతున్నాయి.

నాయీ బ్రాహ్మణ సంఘానికి రూ.50 వేల విరాళం



నాయీ బ్రాహ్మణ సంఘ విరాళం ఇస్తున్న రామమోహన్‌రెడ్డి

గోపాలపురం: గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి తన తండ్రి గాంధీరెడ్డి జ్ఞాపకార్థం స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణ నిర్మాణానిరి రూ.50 వేలు విరాళంగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ చైర్మన్‌గా పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసిన తన తండ్రికి గ్రామస్తులు అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ పోతుల అప్పిరెడ్డి, అయ్యంకి రవి, వర్తక సంఘం అధ్యక్షుడు వింత అమర ప్రసాద్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జగతా అరవాల రాజు, అయ్యంకి గంగరాజు, జగతా రామకృష్ణ, తురాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై టెన్త్ విద్యార్థులకు అవగాహన



టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోహనరావు

గోపాలపురం: కెరీర్ గైడెన్స్‌పై టెన్త్ విద్యార్థులకు మానవత సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యావేత్త టి.మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ నుంచి విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాల్సిన సమయం అన్నారు. ఉన్నత జీవితం కావాలంటే కఠోర శ్రమ అవసరం అన్నారు. టెన్త్ తర్వాత విద్యార్థులు తమ అభిరుచికి, సామర్థ్యానికి, వ్యక్తిత్వానికి తగిన కోర్సులు ఏవేవి ఎంచుకోవాలో ఆయన సూచించారు. మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు బూరెడ్డి వాసు, మాజీ అధ్యక్షుడు ముద్దన మురళీకృష్ణ,ఆ సంస్థ సభ్యులు జొన్నలగడ్డ రాంబాబు, పి.సతీస్, నెల్లి చంద్రశేఖర్, కుక్కల కీర్తికుమార్, ముప్పన కృపావరప్రసాద్‌రెడ్డి టెన్త్ విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలపై లింగ వివక్ష చూపవద్దు



పెరవలిలో ర్యాలీ చేస్తున్న బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు

పెరవలి: బాలికల పట్ల లింగ వివక్ష చూపరాదని, పురుషులతో పాటు ఇప్పుడు స్త్రీలు కూడా అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారని ఎంపీపీ కార్నెల్ల ప్రసాద్ అన్నారు. బాలికా దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలోను, ఎస్సీ కమ్యూనిటీ హాల్లోను నిర్వహించారు. అనంతరం బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పెరవలిలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ బాలికల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ టీబీ కన్వీనర్ ఆశాజ్యోతి, సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాపాక ప్రమీల, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు పి వనజాక్షి, సీహెచ్ లక్ష్మి, వైఎస్సార్ శ్రేణులు నాయకుడు పంపన అంజి, ఉపాధ్యాయులు, కిషోర్ బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల్లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు ఎస్.పద్మావతి, ఎం.సీతామహాలక్ష్మి, నూర్జహాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి గ్రామాల్లో కాంగ్రెస్ పాదయాత్రలు

దేవరపల్లి: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జోడో యాత్రకు మద్దతుగా ఈ నెల 26 నుంచి మార్చి 26 వరకూ గ్రామాల్లో డీసీసీ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహిస్తామని డీసీసీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ తెలిపారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో మంగళవారం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వెలగా రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ గోపాలపురం నియోజకవర్గస్థాయి సమావేశంలో మార్టిన్ లూథర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని విశాఖపట్నం నుంచి అనంతపురం వరకు హాథ్ సే హాథ్ జోడో అభియాన్(చేయి చేయి కలుపుదాం..రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం) అనే నినాదంతో పాదయాత్రలు చేస్తున్నట్టు చెప్పారు. రాజానగరం నుంచి పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. పాదయాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. పాదయాత్ర పోస్టర్‌ను లూథర్ ఆవిష్కరించారు. డీసీసీ మాజీ అధ్యక్షులు రఫీయుల్లాబేగ్, పీసీసీ నాయకులు జ్యేష్ఠ సతీష్, పార్టీ నాయకులు వై.వడయార్, పార్టీ గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండల శాఖల అధ్యక్షులు మట్టపర్తి రామ్మోహన రావు, ఫ్రాన్సిస్, భీమేశ్వరరావు, కాకర్ల హరిబాబు, చాపల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కబడ్డీ జట్లకు ముగిసిన శిక్షణ శిబిరం



రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్న జిల్లా పురుషుల కబడ్డీ జట్టు

చాగల్లు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీనియర్ కబడ్డీ జట్లకు మండలంలోని చిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వరకూ కోచింగ్ క్యాంప్ నిర్వహించినట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణ తెలిపారు. ఈ నెల 21న ఎంపిక పోటీలు నిర్వహించగా, ఎంపికైన క్రీడాకారులకు మూడు రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. క్రీడాకారులు అనకాపల్లిలో నిర్వహించే అంతర్ జిల్లాల సీనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రహరీ నిర్మాణ పనుల పరిశీలన



ప్రహరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: దేవరపల్లిలోని నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం కమ్యూనిటీ భవనం ప్రహరీ నిర్మాణ పనులను ఎంపీపీ కేవీకే దుర్గారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనం నిర్మించి దాదాపు 30 ఏళ్లు కావస్తున్నా ఇప్పటివరకూ ప్రహరీ నిర్మాణానికి గత ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయలేదన్నారు. ఈ సమస్యను సంక్షేమ సంఘ నాయకులు తన దృష్టికి తీసుకురాగా మండల పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు వివరించారు. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు డీడీలు తీయాలి

చాగల్లు: రేషన్ డీలర్లు ఫిబ్రవరి నెలకు సంబంధించి కందిపప్పు, పంచదారలకు వెంటనే డీడీలు తీయాలని సివిల్ సప్‌లై డిప్యూటీ తహసీల్దార్ కె.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీడీలు చెల్లించిన డీలర్లు సరుకులు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి దిగుమతి చేసుకోవాలన్నారు. కార్డుదారులందరికీ కంది పప్పు, పంచదార అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని రేషన్ డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌దారులపై చర్యలు తీసుకోవాలి

నిడదవోలు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని గోపవరం గ్రామంలో వేసిన అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఎంపీడీఓ టి.మూర్తి బాబు, తహసీల్దార్ ఎం.గంగరాజులకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రోడ్లు నిర్మించకుండా, గ్రామ పంచాయతీకి 10 శాతం స్థలాన్ని కేటాయించకుండా పంట పొలాలను ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారంటూ వారు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ టి.మూర్తిబాబు మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.

వడ్లూరులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి...

ఉండ్రాజవరం: మండలంలో వడ్లూరు పంచాయతీ పరిధిలోని రెడ్డి చెరువు గ్రామంలో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బి.శేషారావు పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం టీడీపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. తాడిపూడి, పోచవరం, గజ్జరం గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కర పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, నియోజకవర్గ టూ మెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, నాయకులు నామా శ్రీరాములు, నామా సురేంద్ర, సిద్ధా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బాలికల్లో రక్తహీనతను నివారించాలి



రక్తహీనత నివారణ చర్యలు వివరిస్తున్న నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు

నల్లజర్ల: కిశోర బాలికల్లో ఎనిమీయా తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు సూచించారు. ఆ పీహెచ్‌సీలో మంగళవారం ఐసీడీఎస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బాలికల్లో రక్తహీనత తలెత్తకుండా ఏయే చర్యలు చేపట్టాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం ఇదే తరహా సమావేశం జరుగుతుందన్నారు.పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థినులు జగనన్న గోరుముద్ద తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వారిలో రక్తహీనత ఎక్కువగా ఉన్నట్టు సర్వేలో వెల్లడైందన్నారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా అందిస్తున్న బలమైన ఆహారాన్ని సక్రమంగా వినియోగించేలా చూడాలని డాక్టర్ కోరారు. బిడ్డ పుట్టిన 3 సంవత్సరాల నుంచి వయసుకు తగ్గ బరువు దానికి తగిన విధంగా ఎత్తు ఉండాలన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వైద్య సిబ్బంది సలహా తీసుకోవాలన్నారు.పాఠశాలల్లో ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వాడించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రశేఖరరాజు, ఐకేపీ సీసీ మాలిని, ఐసీడీఎస్, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరి దుబ్బు పిలకల కత్తిరింపుతో నష్టం లేదు



ముక్కామలలో వరి పైరు పిలకల కత్తిరింపు నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

పెరవలి: సేంద్రియ పద్ధతిలో వరిసాగు వల్ల నాణ్యమైన ఉత్పత్తులతో పాటు అధిక ధర లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ సీఏ భవాని సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలం ముక్కామల రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వరిచేలో పిలకల కత్తిరింపు కార్యక్రమం రైతుల ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి దుబ్బుల నుంచి పిలకలను తొలగించడం వలన పంటకు ఎటువంటి నష్టం ఉండదన్నారు. వాటికి పునరుత్పత్తి శక్తి ఉంటుందన్నారు. వరి నాట్లు వేసిన 40 రోజుల వరకూ పంటపై తెగుళ్ళు, చీడపీడలు సోకినా కంగారు పడవలసిన పనిలేదని చెప్పారు. వరినాట్లు వేసిన 40 రోజుల వరకు కొత్త పిలకలు వస్తూనే ఉంటాయన్నారు. పొలంలో ఒక మీటరు సర్కిల్‌ను ఏర్పాటు చేసి అందులో రైతులచే వరి దుబ్బులు తీయించి వాటిలో కొన్ని పిలకలను, ఆకులను కత్తిరింపజేయించారు. తొలగించిన పిలకల స్థానంలో మరో వారం రోజుల్లో కొత్త పిలకలు వస్తాయని అలాగే ఆకులు కూడా ఏర్పడతాయని భవాని చెప్పారు. వరి పంట సాగు పూర్తయ్యాక చిరు ధాన్యాల పంటలను, భూసారాన్ని పెంచే పిల్లిపెసర, మినుము, జనుము, పెసర పంటలను వేయాలన్నారు. ఇందుకోసం సబ్సిడీపై విత్తనాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బుజ్జి, సత్యనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.